## కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి చేయాలి

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, నవంబర్ 25 : డిసెంబర్ 3న జరిగే సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. శనివారం కొత్త వ్యవసాయ మార్కెట్‌లోని గోదాంలో కౌంటింగ్ కేంద్రాల్లో జరుగుతున్న పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సూర్యాపేట, కోదాడ, తుంగతుర్తి, హుజూర్‌నగర్ నియోజక వర్గాల ఎన్నికల ఓట్ల లెక్కింపు సూర్యాపేట కొత్త వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. నాలుగు నియోజక వర్గాలకు వేర్వేరుగా కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి అందులో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద పార్కింగ్, భద్రతతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఓట్ల లెక్కింపునకు ఎలాంటి అటంకం కలుగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, తాసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఏఓ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.


ఎస్‌వీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

### పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ పరిశీలన

ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకునేందుకు స్థానిక ఎస్‌వీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఆదనపు కలెక్టర్ ప్రియాంకతో కలిసి కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ పరిశీలించారు. అక్కడి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు.

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

- ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట, నవంబర్ 25 : ప్రజాస్వామ్యంలో ఓటుకు చాలా ప్రాధాన్యత ఉన్నదని కావునా అర్హులు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. శనివారం ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఎస్పీ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎస్పీ రాహుల్ హెగ్డే ఓటు సిరిసిల్ల నియోజక వర్గంలో ఉండడంతో ఇక్కడి నుంచి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే ఇతర జిల్లాలకు చెందిన అధికారులు, సిబ్బంది ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేశారు. సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం(ఎల్బీనగర్ నియోజక వర్గం), పట్టణ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్(సంగారెడ్డి నియోజక వర్గం), డీపీఆర్ఓ రమేవ్‌కుమార్ (ఖమ్మం నియోజక వర్గం), సీసీఎస్ సీఐ నాగార్జున (యల్లారెడ్డి నియోజక వర్గం), ఎస్ఐ రవీందర్ (నకిరేకల్ నియోజక వర్గం) ఓటు హక్కును వినియోగించుకున్నారు.


పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్న ఎస్పీ రాహుల్ హెగ్డే


ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు వేసిన అధికారులు

## బీఆర్ఎస్‌లో చేరికలు

అర్వపల్లి, నవంబర్ 25 : మండలంలోని ఉయ్యాలవాడ గ్రామ పంచాయతీ పరిధి కుమ్మరి గూడెం గ్రామానికి చెందిన వివిధ పార్టీల మాజీ వార్డు సభ్యులు శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. వారందరికీ గ్రామ శాఖ అధ్యక్షుడు పిట్టల నర్సయ్య గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కోటమర్తి వెంకన్న, పోరండ్ల పద్మయ్య ఉన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సాగర్ల బుచ్చయ్య, మండల నాయకులు తొట్ల శ్రీను, గుంజె ఈశ్వర్, పిట్టల వెంకన్న, ముక్కముల వెంకన్న, నాగయ్య, సురేశ్ పాల్గొన్నారు.


గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న గ్రామ శాఖ అధ్యక్షుడు నర్సయ్య

## 27న జిల్లా మహిళా కబడ్డీ జట్టు ఎంపిక

బొడ్రాయిబజార్, నవంబర్ 25 : డిసెంబర్ 4 నుంచి 6 వరకు నిజామాబాద్ జిల్లా బుసపూర్‌లో జరిగే తెలంగాణ రాష్ట్ర సీనియర్ మహిళా కబడ్డీ పోటీలకు సూర్యాపేట జిల్లా మహిళా కబడ్డీ జట్టును ఈ నెల 27న సోమవారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎంపిక చేయనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రామచందర్‌గౌడ్, నామ నరసింహారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 75 కిలోల లోపు బరువు, ఆధార్ కార్డు కలిగి ఉండాలన్నారు.

వివరాలకు నామ నరసింహారావు సెల్ 9912381165 నంబర్‌కు సంప్రదించాలని పేర్కొన్నారు.

## కాంగ్రెస్ నాటి కరువులను రూపుమాపిన ఘనత బీఆర్ఎస్‌దే

- సూర్యాపేటకు ఏం చేశారో చెప్పే దమ్ము దామోదర్‌రెడ్డికి ఉందా?
- మూసీ గేట్లకు రంధ్రం పడితే పూడ్చాలన్న సోయి లేదు
- బీఆర్ఎస్ పాలనలో వరుసగా 18 పంటలకు సాగునీరు
- తలరాతను నిర్ణయించే ఓటు విషయంలో జాగ్రత్త
- మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- సూర్యాపేట మండలంలో ఎన్నికల ప్రచారం


సూర్యాపేట రూరల్ మండలం పిన్నాయిపాలెం ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట రూరల్, నవంబర్ 25 : సూర్యాపేటలో ఏం చేశామో.. ఏమి చేస్తామో చెప్పే దమ్ము దామోదర్‌రెడ్డికి ఉందా అని బీఆర్ఎస్ సూర్యాపేట అభ్యర్థి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సవాల్ విసిరారు. శనివారం మండలంలోని కేటీ అన్నారం, పిన్నాయిపాలెం, సఫావత్ తండా, ఎర్కారం, రామన్నగూడెం, బాలెంల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ వదిలి వెళ్లిన కరువు కాటకాలను, ఆకలి దప్పికలను రూపుమాపిన ఘనత బీఆర్ఎస్ పార్టీదే అన్నారు. కాంగ్రెస్ పాలనలో మోటార్లు కాలని రైతే లేడన్నారు. మూసీ గేట్లకు రంధ్రం పడి నీరు వృథాగా సముద్రంలోకి పోతూ రైతులకు నష్టం వాటిల్లుతున్నా.. మరమ్మతులు చేయాలన్న సోయి కూడా ఆనాడు దామోదర్‌రెడ్డికి లేదని దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మూసీ గేట్లకు తాము చేసిన మరమ్మతులే వరుసగా 18 పంటలకు సాగు నీరు ఇచ్చి రైతుల కళ్లలో ఆనందం నింపినట్లు తెలిపారు. వరదలకు గేట్లు కొట్టుకపోతే మూడే రోజుల్లో తిరిగి అమర్చిన చరిత్ర తమదని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో బెదిరింపులు, మాముళ్లు, సిండికేట్ల వ్యాపారం తప్పా ప్రజలకు ఏమి చేయలేదన్నారు. 2014లో కారు గుర్తుకు వేసిన ఓటే సూర్యాపేటలో గుండాయిజాన్ని, రౌడియిజాన్ని పారదోలినట్లు వివరించారు. 2014లో వేసిన ఓటు 200 పెన్షన్‌ను రూ.2 వేలు చేసిందన్న మంత్రి దేశంలో ఎక్కడా లేని విధంగా కల్యాణలక్ష్మి, రైతు బంధు, రైతు బీమా, కేసీఆర్ కిట్, 24 గంటల కరెంట్, ఇంటింటికీ స్వచ్ఛమైన మంచినీటిని తీసుకు వచ్చినట్లు చెప్పారు. దామోదర్‌రెడ్డి పాలన కరువు కాటకాలు తెస్తే తమ పాలనలో జాలుపట్టే వరకు నీళ్లు తెస్తా అని చెప్పి మరీ చేసి చూపించినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ హయాంలో ఊరికి పది మందికి పెన్షన్ ఇస్తే గొప్ప అనుకునేవారు. తమ పాలనలో గ్రామానికి 500 మందికి పెన్షన్లు ఇస్తున్నట్లు తెలిపారు. పులులు, సింహాలు, గుంటనక్కలు అక్కర్లేదన్న మంత్రి రైతు బిడ్డగా మరింత అభివృద్ధి చేసేందుకు ప్రజలు మరోమారు ఆశీర్వాదం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జడ్పీటీసీ జీడి భిక్షం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస్‌నాయుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పిన్నాయిపాలెంలో మంత్రి ప్రచారానికి హాజరైన ప్రజలు

### బీఆర్ఎస్‌లో చేరిన ఎంపీటీసీ

చివ్వెంల : మండలంలోని బండమీది చందుపట్లలో యూసీసీఆర్ఐ(ఎంఎల్) పార్టీకి చెందిన ఎంపీటీసీ కోడి బండ్లయ్య పీఏసీఎస్ చైర్మన్ మారినేని సుధీర్‌రావు ఆధ్వర్యంలో మంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జూలకంటి జీవన్‌రెడ్డి, జడ్పీటీసీ భూక్యా సంజీవ్‌నాయక్, సర్పంచ్ బోయిళ్ల కృష్ణ, జిల్లా నాయకులు ధరావత్ బాబూనాయక్, వీరస్వామి, అబ్బులు, సురేశ్, శ్రీను, వెంకన్న, రమేశ్ పాల్గొన్నారు.

### ఎన్ఆర్ఐ రజినీకాంత్‌కు మంత్రి పరామర్శ

మండలంలోని బాలెంల గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ సంగాని రజినీకాంత్, కళ్యాణి దంపతుల కుమార్తె శ్రీయ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. బాలెంల గ్రామంలో శ్రీయ చిత్రపటానికి మంత్రి జగదీశ్‌రెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. రజినీకాంత్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ సంగాని జనార్దన్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌తోనే మరింత అభివృద్ధి

- నాయకుల ఇంటింటి ప్రచారం

సూర్యాపేట టౌన్, నవంబర్ 25 : సూర్యాపేటలో ప్రశాంత పాలన కొనసాగించుకునేందుకు మరోమారు బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటు వేసి మంత్రి జగదీశ్‌రెడ్డిని గెలిపించుకుందామని మంత్రి సతీమణి సునీత ప్రజలను కోరారు. నియోజక వర్గానికి మంత్రి జగదీశ్‌రెడ్డియే సరైన నాయకుడని తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని 26వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మ్యానిఫెస్టోను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. పదేండ్లుగా సూర్యాపేటలో ప్రశాంత వాతావరణంలో జరిగిన అభివృద్ధి పాలనలో ప్రజలంతా అనందంగా జీవిస్తున్నట్లు తెలిపారు. అలాగే తండ్రి గెలుపును కాంక్షిస్తూ మంత్రి కుమారుడు వేమన్‌రెడ్డి పట్టణంలోని 7వ వార్డులో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బత్తుల లక్ష్మి, కుంభం రేణుక, జానీయాదవ్, రాజేందర్, అమరవాది శ్రవణ్ పాల్గొన్నారు.

ఆత్మకూర్.ఎస్ : బీఆర్ఎస్‌తోనే సూర్యాపేట నియోజక వర్గ అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తూడి నరసింహారావు అన్నారు. మండలంలోని ఇస్తాళాపురం గ్రామంలో ప్రచార నిర్వహించి మాట్లాడారు. అరవయేండ్లలో జరుగని అభివృద్ధిని మంత్రి జగదీశ్‌రెడ్డి కేవలం పదేండ్లలో చేసి చూపించినట్లు తెలిపారు. కారు గుర్తుపై ఓటు వేసి మంత్రి జగదీశ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ తూడి లావణ్యానరసింహారావు, ఇరుగు వెంకన్న, కంచర్ల సత్తిరెడ్డి, తూడి రాములు, వెంకన్న, కప్పల నాగయ్య, మహేశ్, గన్న సోమలింగయ్య, యోసేపు, శ్రీను, నాగదుర్గ, ఉమా, సంధ్య, వెంకన్న పాల్గొన్నారు.


సూర్యాపేటలోని 26వ వార్డులో మ్యానిఫెస్టో వివరిస్తూ ప్రచారం చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత


ఆత్మకూర్.ఎస్ : ఇస్తాలాపురంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నరసింహారావు


సూర్యాపేటలోని 7వ వార్డులో ఇంటింటికీ ప్రచారం చేస్తున్న మంత్రి కుమారుడు వేమన్‌రెడ్డి